
ఈ వారం కథ

■ పొన్నాడ సత్యప్రకాశరావు



# బయటే దొరికింది

''ఈ చీర ఎలా ఉందో చెప్పండి''

అప్పుడే ఆఫీసునుంచి వచ్చి తీ త్రాగుతూ టీ.వీ న్యూస్ చూస్తున్న గౌరినాథ్ చేతికి ఓ ప్యాకెట్‌ను అందించింది అతని భార్య ఉమ.

అందంగా ఉన్న ఆ బాక్స్‌ను ఓపెన్ చేసి చూసాడు.

''ఎలా ఉందండీ?''

''చీరకేం బాగానే ఉంది. ఎక్కడిది? ఎంత?''

''వెయ్యి రూపాయలండి... మన ప్రక్కింటి కమలగారి దగ్గర తీసుకొన్నాను. మూడు వాయిదాలలో ఇచ్చెయ్యొచ్చు. మనం నాలుగు నెలల్లో ఇచ్చినా ఏమనరు?''

నొసలు చిట్లించాడు గౌరినాథ్.

''క్రిందటి నెలలోనే కదా క్రొత్త చీర కొన్నావు'' ఇంకా ఆ బాకీ తీరనే లేదు. అప్పుడే మళ్ళీనా?'' అడిగాడు.

''వాళ్ళు ఏమీ అనరు లెండి: మనం రెండు నెలలు ఆలస్యంగా ఇచ్చినా ఒప్పుకొంటారు.''

''అది సరె! ఈ నెలలో పండగలు, పుట్టిన రోజులు ఏమి లేవు కదా! ఏమిటి అవసరం?'' గౌరినాథ్‌కి ఆమె మళ్ళీ చీరె కొనడం ఇష్టంలేదు.

''అదేమిటండీ... పదిహేను రోజులలో మా రాం బాబాయిగారి కూతురి పెళ్ళి ఉండి కదండి. అందుకోసం...''

''ఆయన కూతురి పెళ్ళి అయితే... నువ్వు క్రొత్త చీర కొనుక్కోవడం ఎందుకు... పైగా పెళ్ళికి వెడితే నీకు చీరె పెట్టొచ్చేమో కదా మీ బాబాయి'' మనం కూడా తగ్గట్టుగా కానుకలు చదివించాలి... పైగా ప్రయాణం ఖర్చు.

''అది కాదండి... పెళ్ళిళ్ళో కట్టుకోవడానికని... వాళ్ళు పెట్టేదీ అంతా అయిపోయాక కదా''.

''అదేమిటి... నీకు క్రొత్త చీరెలే లేనట్లే మాట్లాడుతావు. గత నాలుగైదు నెలలుగా నెలకో చీరె ఏదో సందర్భానికని తీసుకొంటూనే ఉన్నావుగా''

''ఆ క్రొత్త చీరెలన్నీ మీ మేనకోడలి పెళ్ళిలోనూ, మా గోపాలం మామయ్య కొడుకు పెళ్ళిలోనూ కట్టేసానుగా... మళ్ళీ అవే కట్టుకొంటే ఏం బాగుంటుందండీ?''

''అంటే ఏమిటీ నువ్వు చెప్పేది... ప్రతీ పండుగకి, మన ఇంట్లో జరిగే శుభకార్యాలకి బట్టలు తీసుకొంటాం... మధ్య మధ్యలో లేటెస్ట్ చీరెలొచ్చాయంటే సరి తీసుకొంటూనే ఉంటావు. ఊర్లో వాళ్ళ పెళ్ళిళ్ళకి కూడా మనం చీరెలు కొనాలి... కట్టుకోవడానికి అంటే ఎలా? ఒకసారి కట్టింది మళ్ళీ కట్టను అంటే ఎలా చావటం... అంత నామోషిగా ఉంటే పెళ్ళికి వెళ్ళడం మానేయ్...

నా మొగుడు చీరె కూడా కొనలేని చవట అని చెప్పుకో... నేనేం అనుకోను...''

''అంతే లెండీ... నా సరదాలెప్పుడు తీర్చేరు కనుక''అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకొంటున్న ఉమనుచూసి సరె...సరె. ప్రతి దానికి ఏడుపొకటి. ఈసారికి తీసుకో. మళ్ళీ నాకు చెప్పకుండా ఏమి చెయ్యకు'' అనునయించాడు గౌరినాథ్...

★ ★ ★

''ఏమండీ... మన పిల్లలని కూడా కాన్వెంట్‌లో వేద్దాం అండి'' ఉమ పోరు.

''అదేమిటి... ఇప్పుడు వాళ్ళు దుంపల బడిలో చదువుతున్నారా?'' గౌరినాథ్ జవాబు...

''అది కాదండీ... ఇంకా పెద్ద కాన్వెంట్... అక్కడయితే చదువు బాగా వస్తుందండీ...''

''చదువుమాట సరే. ముందు మనం అన్ని వేలకువేలు ఫస్ట్ స్టాండర్డ్ నుంచీ పోస్తే రేపు వాళ్ళు పెద్ద చదువులకు వచ్చేసరికి ఏమీ మిగలదు. ప్రక్కింటివాళ్ళు పెద్ద కాన్వెంటికి పిల్లలని పంపిస్తున్నారంటే వాళ్ళు ఇద్దరూ సంపాదిస్తున్నారు... మన సంగతి వేరు''

''సరే లెండి...హాయిగా ఉద్యోగం చేసేదాన్ని కట్టుకోలేకపోయారా? నాకు ఏదైనా ఉద్యోగం చూడండి... డిగ్రీ లేకపోయినా టైపింగ్ పాసయ్యాను.''

ఆమె ఉద్యోగం చెయ్యటం లేదని తను చెప్తున్నాడనుకొంటారేమోనని బాధపడిన గౌరినాథ్.

''అది కాదు ఉమా! మన పిల్లలకి మంచి చదువులు చెప్పించాలని నాకూ ఉంది. అయితే కేవలం డబ్బులు పోస్తే చదువులు రావు. ప్రస్తుతం చిన్న క్లాసులే కాబట్టి మనం కేర్ తీసుకోగలం... ఫీజులు, ఆర్భాటాలు తక్కువే అయినా మన పిల్లలు చదువుతున్నది కూడా మంచి కాన్వెంటే. ఎయిత్త్ క్లాసు దాకా ఇక్కడ ఉంచి నైన్త్‌లో మంచి కాన్వెంట్‌లో వేద్దాం. అప్పుడు మనం చెప్పలేం కదా! అందుకోసం ప్రతీ పైసా ఇప్పటినుంచే పొదుపు చేద్దాం. ఇప్పుడే అంటే ఆటోలకీ బోలెడు అవుతుంది''అంటూ ఊరడించాడు.

★ ★ ★

''ఏమండీ'' ''మరేం''

''ఊ! ఏమిటి...''

మనం ఫ్రిడ్జ్ కొనుక్కొందాం అండీ... అస్తమానూ మన పాల పాకెట్స్, ఆకు కూరలు ప్రక్క ఇంటి వాళ్ళ ఫ్రిడ్జ్‌లో పెట్టమని అడగటానికి మొహమాటంగా ఉందండి.''

''అసలు...వాళ్ళ ఫ్రిడ్జ్‌లో పెట్టవలసిన అవసరం ఏముంది. తెల్లవారేసరికి గుమ్మంలోకి తాజాగా ఆకు కూరలేమిటీ అన్ని అమ్మకానికొస్తాయిగా. కాదు అనుకొంటే నాలుగడుగులేస్తే మార్కెట్‌లో అన్ని దొరుకుతాయి... అసలు ఫ్రిడ్జ్‌లో నీరు త్రాగడం మంచిది కాదు... మన కుండ నీరే బెస్ట్...''

''ఆహా... ఆ విషయాలన్ని వాళ్ళకి తెలియక ఫ్రిడ్జ్ కొన్నారంటారా''.

''వాళ్ల ఫ్రిడ్జ్‌లు, స్కూటర్లు అవసరం ఉండి కొన్నారని నేను అనుకోవటం లేదు... అతనికి పై రాబడి ఎక్కువ... ఏం చేసుకొంటాడు. అవసరం ఉన్నా లేకపోయినా కొనగలిగే స్తోమత ఉంది. నాకు జీతం రాళ్ళు తప్ప వేరే సంపాదన లేదు. ఆస్తులు లేవు. అడ్డదార్లు త్రొక్కే అలవాటు లేదు. రాదు''

చేతకాని మొగుడు... మాటలు మాత్రం చెబుతాడు అనుకొని నెత్తికొట్టుకొంది ఉమ.

★ ★ ★

కూతురి కాపురం చూడటానికి నాలుగైదు నెలలకోసారి వస్తూ ఉంటుంది ఉమ తల్లి భాగ్యమ్మ. ఆమె రెండో కూతురూ, ఉమ చెల్లెలు అయిన రాధ మొగుడు ఇసుక నుంచి కూడా తైలం తియ్యగలడు. అతడూ గౌరినాథ్ లాగా మామూలు గుమాస్తానే. అయితేనేం బల్లక్రింద నుంచి, ప్రక్కనుంచి పైనుంచి తెగ సంపాదిస్తాడు. పెళ్ళాం ఒళ్ళు అంతా బంగారు మయం చేసేసాడు. స్వంత ఇల్లు కట్టుకొంటున్నాడు. అధునాతన జీవితాన్ని అనుభవిస్తూ ఉంటాడు.

భాగ్యమ్మ ఎప్పుడూ చిన్న కూతురి వైభవం గురించి, చిన్న అల్లుడి ''సమర్థత''గురించి పెద్ద అల్లుడికి చెబుతూ ఉంటుంది. పైగా ఆవిడకి పెళ్ళి చెయ్యాల్సిన ఇంకో కూతురుంది. ఆ పిల్ల పెళ్ళికి చిన్న అల్లుడి సహాయం పొందబోతోంది. దాంతో పెద్ద అల్లుడి గురించి చులకనగా మాట్లాడుతుంది. ఆమె చూసే సంబంధాలలో కులం, గోత్రం, జాతకాల వంటివే కాకుండా ''బయటేమైనా దొరుకుతుందా''అని విచారిస్తూ ఉంటుంది. ఆమధ్య అన్నీ రకాలగాను మంచిది అయిన సంబంధం వస్తే కాబోయే అల్లుడికి బయట సంపాదన లేదని తెలుసుకొని ఆ సంబంధం వదులుకొంది. అల్లుడు, కూతురుతో కలిసి బజారుకో, గుడికో వెళ్ళవలసి వస్తే సిటీ బస్సులకోసం నుంచోడం ఆమెకు చికాకు. అదే చిన్న అల్లుడయితే ఆటోల్లోను కార్లలోనూ ఆమెను ఎలా తీసుకెళ్ళేవాడో చెప్పేది అంతా బయట సంపాదన పుణ్యం అనేది. దేనికైనా పెట్టిపుట్టాలి అనేది. 'నీతి నిజాయితీ, పాపం పుణ్యం'అంటూ కూర్చొంటే గొంగళి బ్రతుకే అనేది.

''ఎవడో ఎప్పుడో కంప్లైంట్ ఇస్తాడు. రెడ్‌హేండెడ్‌గా దొరికిపోయి ఉద్యోగం పోగొట్టుకుంటే అప్పుడు తెలుస్తుంది'' అనేవాడు గౌరీనాథ్.

''ఆ చేతకాకపోతే సరి! ఎంతమంది ఎటువంటి ఇబ్బంది లేకుండా సంపాదించి రిటైర్ అయ్యారో చెప్పేది భాగ్యమ్మ కూతురికి. ఒకరిద్దరూ పట్టుబడ్డా మళ్ళీ ఎలా ఉద్యోగంలోకి వచ్చారో ఆ ఖర్చు కూడా ఎలా రాబట్టుకొన్నారో చెప్పేది.

★ ★ ★

చెల్లెలి వైభవం, తల్లి మాటలు ఉమకి బాగా తలకెక్కాయి. నిజాయితీకి మారుపేరైన గౌరీనాథ్‌ని సూటిపోటీ మాటలతో ఆడిపోసుకొనేది.

అతనికి మనశ్శాంతి లేకుండా చేసేది.

పాపం! గౌరీనాథ్ పరిస్థితి దుర్భరమైపోయింది.

చాలీచాలని జీతం, ఎదుగుతున్న పిల్లలు, అవసరాలు పెడమొహం పెట్టే భార్య...

డబ్బు సంపాదిస్తేనే ఇంట్లో ఉండగలిగే పరిస్థితి ఏర్పడింది.

ఆ సమయంలో అతనికి దగ్గరయ్యింది జ్యోతి.

ఆమె ఓ విడో.

వివాహమయిన రెండేళ్ళకే భర్తని కోల్పోయింది.

ఒక బాబు.

ఆమె భర్త రెండేళ్ళకే భర్తని కోల్పోయింది.

ఒక బాబు.

ఆమె భర్త గౌరీనాథ్ ఆఫీసులోనే పనిచేసేవాడు.

పచ్చి త్రాగుబోతు. మితిమీరిన త్రాగుడు కారణంగా లివర్ చెడిపోయి చాలా చిన్న వయసులోనే కన్నుమూశాడు.

ఆమెకి రావలసిన డబ్బు విషయంలో ఎంతో సాయం చేసాడు గౌరీనాథ్.

ఎంతోకొంత ముట్టపెట్టందే భర్త తాలూకా డబ్బులు రావనే అభిప్రాయంలో ఉన్న ఆమెకు గౌరీనాథ్ పైసా కూడా తీసుకోకుండా రావలసిన డబ్బులు అందేటట్లు చూడటమే కాకుండా ఆమె డిగ్రీ చదివిందని పెద్దల అండ పెద్దగాలేదని తెలుసుకొని ఆమెకు ఆ ఆఫీసులో ఉద్యోగం వచ్చేటట్లు ప్రయత్నించాడు. అది జరిగి ఏడేళ్ళు అయింది.

'విడో''పైగా అందంగా ఉండేది' కావడంతో తత్సంబంధమైన సమస్యలెన్నో ఆమె ఎదుర్కొంది. ఏమి ఆశించకుండా తనకు సాయంచేసిన గౌరీనాథ్‌ని గౌరవించిన జ్యోతి తరువాత తరువాత అతని ప్రవర్తన, సిన్సియారిటీలకు మెచ్చుకోకుండా ఉండలేక పోయింది. అతను నిప్పు హగా ఉండటాన్ని గమనించిన ఆమె అతనినుంచి కొంత రాబట్టింది. మిగతాది ఊహించ గలిగింది. అతని మంచితనం అతనికి మంచి కలిగిస్తుందని పదేపదే చెబుతూ ఉండేది. క్రమక్రమంగా ఇద్దరిమధ్యా అభిమానం, అనురాగం కలుగసాగాయి.

అయితే హద్దులు దాటలేదు ఎప్పుడూ...

★ ★ ★

గౌరీనాథ్ కొడుకుని (ఇంటర్ మీడియెట్) ఓ కార్పొరేట్ కాలేజీలో చేర్పిద్దామనుకొన్నాడు. పొదుపుచేసిన కొద్ది మొత్తం ప్రావిడెంట్ ఫండ్ లోంచి తీసినది. కలిపి ఆ కాలేజీ కరెస్పాండెంట్‌ని కలిసి రాయితీకోసం అభ్యర్థించాడు. అదే



లక్షల బిల్లు పాస్‌చేసి కూడా డైరీ పుచ్చుకోవడానికి కూడా మొహమాట పడేవాళ్ళని మా స్టాఫ్ చెప్పగా విన్నాను. మీరు పుచ్చుకోకపోయినా మీ పై బాస్ దొబ్బుతూనే ఉన్నాడు. ఓ మంచి వ్యక్తి పిల్లలకి విద్యాదానం చేసామన్న తృప్తి మాకు మిగలనివ్వండి.

సమయంలో ఆ రూంలోకి వచ్చిన ఓ వ్యక్తి గౌరీనాథ్‌ని గుర్తుపట్టి విషయం తెలుసుకొని కరెస్పాండెంట్‌తో మాట్లాడి పదివేల రూపాయల రాయితీ ఇప్పించాడు.

కానీ తీసుకోవడానికి గౌరీనాథ్ సంశయించాడు. ఆయన నవ్వుతూ ''చూడండీ గౌరీబాబు. నేను కాంట్రాక్టర్ని. ఈ కాలేజీ కమిటీ మెంబర్ని. నాకు మీ ఆఫీసుతో ఎన్నో పనులున్నాయి. ఇంకా ఉంటాయి మీరు బిల్లు సెక్షన్‌లోకి రాకముందు పనిచేసినవాడు మమ్మల్ని ఎంతో ఇబ్బంది పెట్టాడు. మేం సాధారణంగా క్రింద నుంచి పైదాకా అందరిని సంతోష పరచడానికే చూస్తాం. కానీ వాడు మేం సంతోషంగా ఇచ్చిన దానికన్నా ఎక్కువ దండాలని చూశాడు. మీ పై బాసే మా చేతిలో ఉన్నాడు. అందుకే వాడిని సీటులోంచి మార్పించి మీ గురించి తెలుసుకొని ఆ సీటులోకి వేయించింది నేనే. లక్షల బిల్లు పాస్‌చేసి కూడా డైరీ పుచ్చుకోవడానికి కూడా మొహమాటపడేవాళ్ళని మా స్టాఫ్ చెప్పగా విన్నాను. మీరు పుచ్చుకోకపోయినా మీ పై బాస్ దొబ్బుతూనే ఉన్నాడు. ఓ మంచి వ్యక్తి పిల్లలకి విద్యాదానం చేసామన్న తృప్తి మాకు మిగలనివ్వండి. మీకు ఇంకో పాప కూడా ఉందని విన్నాను. ఆ పాపను కూడా మా కాన్వెంట్‌లో వెయ్యండి. మీ దగ్గర మేము గవర్నమెంట్ ఫీజ్ మాత్రమే పుచ్చుకొంటాం... అదీ మీ తృప్తికోసం... కాదనకండీ... మీవల్ల ఇప్పటికే ఎంతో లాభం పొందాం... ఇంకా ఎన్నో టెండర్లు ఉన్నాయి. మీరు ఆ సీట్లో ఉంటే మాకు ఎంతో లాభం... కాదనకండి'' అన్నాడు.

కాదనలేకపోయాడు గౌరీనాథ్.

గవర్నమెంట్ కాలేజీ లాగా ఫీజు కట్టాడు.

అతనికి పదివేలు పైనే మిగిలింది.

★ ★ ★

గౌరీనాథ్ ఆనందానికి అంతే లేదు.

ముందు గిల్టీ ఫీలయ్యాడు కానీ సరిపెట్టుకొన్నాడు.

తను చేసింది చిన్న తప్పు... అంతే...

ఘోరం ఎంతమాత్రం కాదు.

ఆ ఆనందాన్ని సెలబ్రేట్ చేసుకొందామనుకొన్నాడు.

స్వీటు ప్యాకెట్ తీసుకొని బయలుదేరాడు.

తన ఇంటికి కాదు... జ్యోతి ఇంటికి...

అతనో తప్పు చేయాలనుకొంటున్నాడు.

అతను చేతులు చాచాలని ఎప్పుడు చూడలేదు.

బల్లకింద చేతులు పెట్టలేదు. ఎన్ని అవకాశాలొచ్చినా...కాని ఇప్పుడు ఏ మాత్రం అవకాశం వచ్చినా... వదల దలచుకోలేదు. ఏమాత్రం అవకాశం వచ్చినా 'జ్యోతి చేతుల్లో' వాలిపోవాలనుకొంటున్నాడు.

★ ★ ★

జ్యోతి ఇంట్లో...

ఆమె ఎంతో సంతోషించింది. ఆ డబ్బు తీసుకొని ఉమకు ఏదైనా గొలుసు తీసుకొని వెళ్ళమంది. తన జేబులోంచి అప్పటికే కొన్న గొలుసును తీసాడు. తనకు మనశ్శాంతి, స్వాంతన ప్రసాదించిన వాళ్ళకే అది చెందాలన్నాడు.

ఇద్దరి కళ్ళు ఆర్తిగా కలుసుకొన్నాయి.

అడుగుముందుకు వేసాడు. చేతులు చాచాడు...

ఆమె గుండెల్లో తల దాచుకొన్నాడు.

★ ★ ★

గంట తరువాత ఇంటికి బయలుదేరాడు జేబుల్లో గొలుసుతో... జ్యోతి గొలుసు వద్దంది. అతని ప్రేమ కావాలంది...

★ ★ ★

మూడు కాసుల గొలుసు చూసి ఎంతో ముచ్చటపడింది ఉమ. అబ్బురపడింది భాగ్యమ్మ.

★ ★ ★

తరువాత గౌరీనాథ్ మారిపోయాడు.

పాపను కూడా ఆ కాంట్రాక్టర్ స్కూల్లోనే చేర్పించాడు.

మిగతా కాంట్రాక్టర్స్‌తో కూడా మంచి సంబంధాలు పెట్టుకొన్నాడు. పీడించకుండా చిన్నచిన్న లాభాలు పొందటం మొదలుపెట్టాడు.

''తానొవ్వక... ఒరుల నొప్పించక''అన్నట్లు మెసలుకోసాగాడు.

ఆనందం కలిగినా, బాధ కలిగినా, తప్పుచేస్తున్న భావం కలిగినా జ్యోతి ఒళ్ళో సేద దీరేవాడు.

అది తప్పే... కానీ...

ఎంతో ఇష్టపడి చేస్తున్న తప్పు.

★ ★ ★

ఆ 'తప్పు'విషయం చూచాయిగా తెలిసింది ఉమకి. ''అల్లుడుగారూ'' అంటూ నచ్చచెప్పబోయింది భాగ్యమ్మ.

''చూడండి అత్తయ్యగారు! మీకు, మీ అమ్మాయికి ఎప్పుడు బయట ఎంత దొరుకుతుంది అనేదే కావాలి. నాకు బయట దొరికిన లాభాన్ని మీ అమ్మాయికే ఇస్తున్నాను. మీ అమ్మాయికి కావలసినవన్నీ, సమకూరుస్తున్నాను. నాకు కావలసిన శాంతి, 'ఇంట'దొరకని అభిమానం, అనురాగం 'బయట' దొరికింది. నేనేమి మీ అమ్మాయికి అన్యాయం చెయ్యను. కంగారు పడొద్దు. మీకు కావలసింది బయట సంపాదిస్తున్నాను. నాకు కావలసిందే బయటే దొరుకుతోంది అంతే!'' అన్నాడు. ★